కిష్కింధలో కోతి

చింతా దీక్షితులుగారు

౧

ఆ కొండను మీరు చూచి ఉండరు. నాటికీ నేటికీ ఎవ్వరూ కూడా ఆకొండను చూచి ఉండరు. చూడరు. చూడడానికి ఎవ్వరికీ మనస్కరించదు. అంత పాపభూయిష్ఠమైన కొండ అది. న్యాయానికి ఆకొండది తప్పు కాదు. దాని నాశ్రయించుకొని బ్రతికిన నావల్ల ఆకొండకు కళంకం వచ్చింది.

పవిత్రమైన ఏటిగట్టుననే ఉన్నది ఆకొండ; లోకాల కళంకాన్నంతా కడిగివేసే శక్తిగల ఆయేరు ఈకొండ కళంకాన్ని కడగలేదు. నావల్లనే ఆకళంకం ఆకొండకు పట్టుకొంది కాబట్టి.

పవిత్రమైన ఏరు. అద్దరినీ ఇద్దరినీ దట్టముగా పెరిగిన ఫలవృక్షములు. నీటిఅంచుల నాశ్రయించి పెరిగిన రెల్లుదుబ్బులూ. రెల్లుదుబ్బుల నాశ్రయించిన చిన్నపక్షులు, అనంతప్రాణికోటి. ఆయేటి ఒకగట్టున నాకొండ. కొండకు అన్నివైపులా ఫలవృక్షములు. ఎవరు పెంచారో మాకోసమని ఆఫలవృక్షములు; ఎవరు మాకోసమని పాలవంటి ఏటినీళ్లు ఆ ప్రాంతముననే ప్రవహింపజేస్తున్నారో; మాకు ఇరుగు పొరుగుగా ఉండేటందుకు ఎవరు ఆపాటలుపాడే పక్షులను, ఆచిందులుత్రొక్కే మృగములను, ఆగంతులువేసే కీటకాదులను ఆప్రాణికోటి నంతనూ సమకూర్చారో; ఎవరి దయాదాక్షిణ్యములు ప్రాపుగా మేము ఆ అడవిలో కులాసాగా కాపురం చేస్తున్నామో-మాకు తెలియదు. తెలుసుకుందామని ఊహా, ఇచ్ఛ మాకు కలగలేదు. నేనూ, నాకుటుంబమూ ఆకొండమీద కాపురము, ఆ అడవిలో సంచారము, ఆయేటిమీద విహారము. సౌఖ్యమునకు ఇదేమేరకదా అనుకొన్నాము. మా కొండమీద పెద్దపెద్ద పాషాణములు పేర్చిపెట్టినట్లున్నవి. ఆపాషాణములే ద్వారముగా ఉన్నవి. గదులుగా ఏర్పడ్డవి. అంతఃపురములైనవి. ఆపాషాణములే వేదులు, జరుగుడుబండలు; ఆపాషాణములే కోటగోడలు, సొరంగములైనవి. ఆకొండ మాఊనికిపట్టుగా, మాఇల్లుగా, మానగరుగా మేము భావించుకొంటున్నాము.

ఆ కొండప్రక్కలమీద నిలువుగా చెట్లు పెరిగినవి. దట్టముగా పెరిగినవి; ఆకొండ చుట్టూ దట్టముగా పెరిగినచెట్లు; ఆకొండనుంచి చూపుకందనంతదూరము వరకూ దట్టముగా చెట్లు. ఆచెట్లు మాకు సంచారభూములు; ఆచెట్లు మాకు ఆటపట్టులు; ఆచెట్లు మాకు భోజనములు; ఆచెట్లు మాకు లీలోద్యానములు. సౌఖ్యమునకు ఆకొండా ఆ అడవీ మేర అని మాకుమాత్రం తోచడము లేదూ?

ఆచెట్లకొమ్మలలో రాత్రివేళ మేము నిద్రించే సమయాన చిరుతపులులూ, పెద్దపులులూ, ఏనుగులూ, సివంగులూ, తోడేళ్లూ ఆప్రాంతమున సంచరిస్తూ బొబ్బరిస్తూ ఉంటవి. మాకు అవి తలారులు. ఈ బొబ్బరింతలతో అడవి అంతా ప్రతిధ్వనిస్తూ ఉంటే మాకు హాయిగా నిద్రపట్టుతుంది.

పగటివేళ లేళ్లు మాకొండచుట్టూ చెంగలిస్తూ తిరుగుతవి. పక్షులు, వన్నె వన్నెలపక్షులు, రెక్కలు విప్పి చాచి ఎగురుతూ మాకు నేత్రానందము కలుగజేస్తవి. రకరకముల గొంతుకలతో రకరకముల పాటలతో, రకరకముల పలుకులతో అడవిని మధురారావములలో ముంచివేస్తవి కొన్నిపక్షులు. రాలేక రాలేక చెట్లసందులలోనుంచి సూర్యకిరణములు బలవంతముగా సందుచేసుకువచ్చి పచ్చికలమీద శయనిస్తవి. మాకొండప్రక్కల మీద మేకలూ, జింకలూ, ఆవులూ మందలుగా వచ్చి తియ్యనిపచ్చిక మేస్తవి.

మాయేటి కీవలిగట్టునా ఆవలిగట్టునా పెరిగిన వృక్షములు కొమ్మలూ కొమ్మలూ కలుపుకోవడం వల్ల మేమంతా ఏటి నడిమిభాగము చేరి నీడలతోనూ వెలుగులతోనూ ప్రవహించే సుళ్లుతిరిగే, తలక్రిందులయ్యే, చెంగునదాటే ఏటినీళ్లను చూస్తూ ఉంటాము.

ఈ సౌఖ్యోన్నతికి వశులమై తిండికీ నీటికీ లోటు లేకుండా ఆకొండమీద మేము కాపురము చేస్తున్నాము. అప్పటి కింకా ఆకొండకు కళంకము రాలేదు.

౨

ఒకనాడు ఒకపెద్ద కేక వినిపించింది. ఆ కేకకు చెట్లకొమ్మ లల్లల్లాడినవి. కొండగుహాలు ప్రతిధ్వనించినవి. ఆ కేక నందుకొని మా యేరు అన్ని దిక్కులా దానిని వ్యాపింపచేసింది.

ఆ కేక వానరలోకాన్ని ఉద్దేశించినది. వానరలోకానికంతకూ అది చాటింపు. పుట్టినాడట లోకములో పుణ్యపురుషు డొక్కడు. సంహరించినాడట వానర చక్రవర్తిని వాలిని.

కట్టినాడట పట్టము కపిలోకమునకు సామ్రాట్టుగా సుగ్రీవునకు.

ఆపుణ్యపురుషుడు అవతారపురుషుడట. ఆ అవతారపురుషుని నామమై పవిత్రమైనదట రామశబ్దము.

ఆచాటింపు, ఆ కేక, ఆపిలుపు మా శ్రవణపుటములలో ప్రవేశించి హృదయమున హత్తుకొన్నది. ఆ కేక మాకు ఆదేశ మైనది.

పుణ్యపురుషుడు అవతారపురుషుడు జన్మించిన కాలాన మీరు సమకాలీనులై ఉండడం తటస్థించిందా? అప్పుడుగాని మాసంతోషం మీకు బోధపడదు.

పుణ్యపురుషుని కనగలిగిన కాలము ఎంత మహత్తర మైనదో తత్కాలముననే ఉండే జను లెంత అదృష్టవంతులో ఆ కాలపువారికి తెలియకపోయినా తరువాతిప్రజలు తెలుసుకొంటారు. ఆకాలమున తాముండకపోతిమి గదా అని వగతురు.

కాలము అనంతమైనది. అందులో కొన్ని భాగాలు ఉత్కృష్టములు. ఉదయించే సూర్యునిశోభ ప్రభాతానికి పట్టినట్లు ఉదయించే మహాపురుషునిశోభ ఆకాలానికి పట్టుతుంది.

ఒకదివ్యకాంతి ఆకాలాన్ని ఆవరిస్తుంది.

ఒకదివ్యసౌరభము ఆకాలములో ఇమిడి ఉంటుంది. ఆకాలానికే ఒక దివ్యమైనమాధుర్యం ఉంటుంది. ఆకాలములోనే పక్షులు మరీ శ్రావ్యముగా పాడుతవి. ఆకాలములోనే మేఘములు నెలకు మూడువానలు కురుస్తవి. పంచభూతములూ ఆకాలభాగాన్ని అంటి ఉన్న కల్మషాన్ని కడిగివెయ్యడానికి పూనుకొంటవి.

మహాపురుషోదయాన్ని చూడగలిగిన ఆనాటి ప్రజలు ఎంత అదృష్టవంతులై ఉంటారు!

ఆకాలపుప్రజ లందరూ అదృష్టవంతులా? ఆకాలపువారి కందరికీ సంతోషముంటుందా? కారు; ఉండదు.

కోరికలు పెంచుకొని పెంచుకొని ఆకోరికలు సఫలపరుచుకోవడమే సంతోషమని ఊహించే వారికి మహాపురుషోదయముతో ఏమిపని?

అధికారమును ఆశ్రయముగా చేసుకొని లోకమున కుపకారం చేస్తున్నామని చెప్పి అపకారం చేసే వారికి మహాపురుషోదయము అసంభవము.

తమతమ శాసనములకు ప్రజలను లొంగదీసుకొని వాటినే మతముగా భావించుకోమని బోధించే వారికి మహాపురుషోదయమేటికి? మహాపురుషోదయమునాటి ప్రజలు అవతారకారణమైన మహాపురుషుని కార్యములు సాధించుకోడానికి సాధనములై ఉంటారు. అందువల్లనే వారికి సౌఖ్యముండదు. లోకులు సాధారణముగా దేనిని సౌఖ్యమని భావిస్తారో అది ఉండదు. వారి జీవితమంతా కష్టభూయిష్ఠమై ఉంటుంది. మహాపురుషునితోబాటు జన్మించినందుకు వారికి ఫలము ఈసడింపులు, బాధలు, మరణము.

కాని వారి మనస్సుమాత్రము నిండుశాంతితో నిండి ఉంటుంది.

బాధలు తలుచుకొని మహాపురుషుని ఆదేశములు లెక్కచెయ్యరు కొందరు.

మహాపురుషుని ఆదేశనిర్వహణము స్వర్గతుల్యముగా భావించి సమస్తమూ అందుకొరకై ధారపోస్తారు కొందరు.

3

ఆనాటి కపిలోకమునకు ఆజ్ఞవచ్చినది. రాముని ఆజ్ఞ సుగ్రీవునిద్వారా వచ్చినది.

ప్రతియొక్కకపినీ ఉద్దేశించిచేయబడ్డ ఆజ్ఞఅది. రాక్షససంహారమునకు పూనుకొమ్మని ఆజ్ఞ. సుగ్రీవుని కేతనముక్రిందచేరి రామకార్యమును కపులందరూ నిర్వహించమని ఆజ్ఞ.

అట్టి ఆజ్ఞలో ధనములేదు. సౌఖ్యము లేదు. అట్టి ఆజ్ఞలో నిరంతరత్యాగ మున్నది, స్వర్గ మున్నది.

ఆ ఆజ్ఞ కిష్కింధ అంతటా వ్యాపించినది. కిష్కింధావాసులందరూ దానిని పాటించారు. సుగ్రీవునాజ్ఞ తలదాల్చి స్వధర్మ నిర్వహణార్థము బయలుదేరారు. స్త్రీపురుషవిచక్షణ లేదు. వృద్ధులు బాలురూ అనేవిచక్షణలేదు. అందరూ ఒక్క హృదయముతో ఒక్క పట్టుదలతో, భక్తితో ఆవేశముతో సుగ్రీవుని కొండ చేరారు. త్యాగమనే బుద్ధిలేదు. కీర్తి వచ్చుననే ఆశ లేదు. శాశ్వతత్వము వారికి కలుగుననే ఆశలేదు. స్వామికార్యముమీదనే బుద్ధి. మహాపురుషుని ఆదేశమును విధేయపూర్వకముగా అంగీకరింపవలెననియే సంకల్పము. వారందరూ ధన్యులని వేరే చెప్పవలెనా?

ఆ ఆజ్ఞ మాకొండనూ చేరినది. మా చెవులలోకూడ పడ్డది. ఆ ఆజ్ఞవిని మాకొండ, అచ్చటివనము, ఆయేరు, పులకితములైనవి. ఆ ఆజ్ఞను విన్న సంతోషము మాకు కలిగింది.

ఆ ఆజ్ఞను అందరూ పరిపాలిస్తున్నారనే వార్త మాకు సంతోషము కలిగించింది. మా జాతివారందరూ స్వామికార్యధురంధరులనిన్నీ, మాజాతివారందరూ త్యాగశీలురు, పరాక్రమశాలులూ అనిన్నీ మాకు గర్వము కలిగింది. మాహృదయములుకూడా ఉప్పొంగినవి.

సుగ్రీవుని కేతనము క్రిందకు మేము కూడా సాయుధులమై చేరవలెనుగదా! సోత్సాహులమై శ్రీరామకార్యము మేము మాత్రము పూనుకొనవద్దా? మమ్మూకూడా ఉద్దేశించినదేగదా ఆ ఆజ్ఞ. స్వామిఆజ్ఞ కెదురుపోవచ్చునా? దైవకార్యము కాదనవచ్చునా? ఎవరికొరకు యీ దేహములు పెంచుకొనుచుంట—స్వామికొరకేగదా!

ఎవరివల్ల యీసౌఖ్యములు మాకు కలుగుతున్నవి — స్వామివల్లనేకదా!

జన్మకు సాఫల్య మేమిటి? — బ్రదికినందువల్ల ఫలమేమిటి? — అవతార పురుషుడు వచ్చి తనకార్యము నిర్వహించమని ఆదేశించినప్పుడా వెనుకంజ వెయ్యడం? మేముమాత్రము కపులము గామా? కిష్కింధనేలే సుగ్రీవుడు మారాజు గాడా? సుగ్రీవుని దేవుడు మా దేవుడు గాడా?

మేము కర్తవ్యమును నిర్ణయించుకోవలసినపని యేమున్నది? మేము ఆలోచించవలసిన పని యేమున్నది? మేము సందేహించవలసిన పనియేమున్నది? కాని—

౪

కాని మేము కర్తవ్యమును నిర్ణయించుకోవలసి వచ్చింది. మేము సందేహించాము? మేము ఆలోచించవలసి వచ్చింది! ఆలోచించడం మొదలుపెట్టాము. సంశయాత్మ నశిస్తాడంటారు. మేమూ సంశయించాము. సంశయాలు తీర్చుకొని ఆలోచనలు సాగించి ముగించి తరువాత స్వామికార్యానికి పూనుకోవలెనని సంకల్పము చేసుకొన్నవారాకార్యములలో ఎప్పుడైనా దిగడం సంభవిస్తుందా?

ఇక్కడ మాకొండ—సర్వసౌఖ్యాలకూ ఆలవాలమైనకొండ—ఇహసౌఖ్యాలకి మేరచూపించే కొండ!

అక్కడ లంకాపురి—భీషణవక్త్రాగ్నిహ్వారము తెరుచుకొని నృత్యము చేస్తూన్న మృత్యుదేవత కాటపట్టయిన లంకాపురి—భయము, బాధ, బీభత్సముల కాకరమైన లంకాపురి!

ఇది మేలా? అది మేలా?

ఇక్కడి ఈయేరు – ఈవనము – ఈ మృగముల సందడి ఇక్కడి ఈవిహారములు ఇక్కడి ఈసంచారములు ఈ సుఖములు — వీటికి బదులుగా అక్కడి సముద్రోత్తరణము, సేతునిర్మాణము, దూరప్రయాణము—ఆ రాక్షసుల కోలాహలము — అక్కడి గర్భనిర్భేదకమగు రణభేరీశబ్దములు — అక్కడి రణరంగవిహారములు, శత్రుదేశసంచారములు — అక్కడి ఆకష్టములు! ఇక్కడ ఉంట మేలా? అక్కడికి పోవుట మేలా?

ఇహసౌఖ్యములకూ పరసౌఖ్యములకూ సంఘర్షణ కలిగింది. ఇంద్రియసౌఖ్యములకూ పరసౌఖ్యములకూ ప్రబలయుద్ధము తటస్థించింది.

ప్రత్యక్షసౌఖ్యములను చూపి ఇంద్రియములు పరసౌఖ్యముల నీసడించుచున్నవి.

రానున్న శాశ్వతత్వముకై ఆశ, అందులో నిరవధికానందమును తెలిపి పరసౌఖ్యములు ఇంద్రియములపై దాడి వెడలుచున్నవి.

ఇంద్రియసుఖములలో మృత్యువు నిత్యమూ సంచారం చేస్తూ ఉంటుంది.

పరసౌఖ్యములోనిత్యత్వము నిర్మలత్వము!

చేతులో సుఖములను వదిలిపెట్టి ఎప్పుడో రానున్న సుఖముల కపేక్షించడం వివేకమేనా? మా దేహములే మాస్వామి కేతనము కిందికిపోయి సహాయము చేయవలెనా? మా మనస్సుల కాశక్తిలేదా? మాఇచ్ఛాశక్తి మా స్వామి ననుసరించి ఉండరాదా? మాసంకల్ప బలము మాదేహబలముకన్న ఎక్కువ ప్రయోజనకారి కాకూడదా?

వానర సేనల విజయఘోషములు మాకొండను చేరినవి. మావానర సేనల సేతునిర్మాణములో మాసంకల్పసాహాయ్యము మేము చూచుకొన్నాము.

మావానర సేనల లంకాప్రవేశములో మా మనస్సులూ ఉన్నవి.

మావానర సేనల భీషణయుద్ధములో మా మనస్సులూ పాల్గొన్నవి.

రాక్షససంహారము జరుగుతున్నది. వీరవానర హుంకారనాదములను మాకొండ ప్రతిధ్వనిస్తున్నది. రాక్షసహాహాకారములు మాయేటి చప్పుళ్లలో కలిసిపోతున్నవి.

రాక్షసరాజును రామభూపాలుడు సంహరించిన వార్త పంచభూతములూ, దశదిక్కులూ వ్యాపింపజేసినవి. మా కొండకూ ఆవార్త చేరినది.

మామనస్సులలో సంతోషము మేము తెచ్చి పెట్టుకొన్నదా? నిజమైనదేనా? దానికి సహజత్వము లేదేమి?

లోకములో కొండలు తలలూపి ఆడినవి! మా కొండ తల ఊపి ఆడలేదు.

లోకములో నదులు చెంగుచెంగున గంతులు వేస్తూ ప్రవహించినవి. మాయేరు మందమై, శుష్కమై ఇసుక తిన్నెల నంటిపెట్టుకు పోయింది.

లోకములో వనములు చిగిరించినవి. మొగ్గలు తొడిగినవి. పుష్పించినవి. పరిమళములను నల్గడల ప్రసరించినవి.

మావనము తలవాల్చినది. పుష్పములరాల్చినది. వాయువును బంధించినది.

లోకము ప్రకాశవంతమైనది. మా నివాస మంధకార మయమైనది.

లోకము నవ్వినది!

మావాసస్థానము సిగ్గుచే తలవంచి దుఃఖముచే కుమిలిపోయినది.

స్వామికార్య నిర్వహణము మావానరకులమునకు గర్వకారణమైనది,

మాకు శాశ్వత కళంకము నాపాదించినది.

లంకనుగెలిచి కిష్కింధారాజ్యమును మా వారు చేరుకొన్నారట. ఆవార్త మాకు చేరినది. మాకు ఉత్సాహము లేదు.

మాకొండ మాకు భోజనము పెట్టడము మానుకొన్నది.

మాయేటి స్వాదుజలము లిప్పుడు చేదైనవి. మాకు విహారములు లేవు.

పశ్చాత్తాపమువల్ల లాభముంటుందా? స్వామికార్యమును లక్షించని సేవకులకు గతి ఉన్నదా?

అవతారపురుషుని ఆదేశమునే అంగీకరించని మందుల కెన్నటికైనా మోక్షలాభమున్నదా? ఆకొండకు కళంకం నావల్లవచ్చింది. ఆకొండ వల్ల నాకు కళంకం వచ్చిందని చెప్పి నాపాపమును నేను వృద్ధిచేసుకోను. ఆకొండను మీరు చూచి ఉండరు. చూడరు.